# పరిహారము

ద్వివేదుల విశాలాక్షి

పదవ నెంబరు బస్సు రోడ్డు చేసుకొంటూ తొమ్మిదన్నరకల్లా వచ్చి ఆ స్టాపులో ఆగుతుంది. నేను తొమ్మిదింబావు కల్లా ఇంటిదగ్గర బయలుదేరుతాను. రిస్టు వాచిలో సెకండ్ల ముల్లు చూసుకొంటూ అడుగులు వేసూ ఆ రోడ్డు కొలుస్తాను. భగవంతుడి దయవల్ల మా వీధిలో కారుల, బస్సుల రద్దీ ఉండదు. లేకపోతే నేను ఏ కారుక్రిందనో పడి ఏనాడో చచ్చిపోయి ఉంటాను.

కిళ్లీ దుకాణం దగ్గరికి చేరేసరికి తొమ్మిదీ ఇరవై రెండు. వాడు కట్టి ఇచ్చిన కిళ్లీ నానోటిలోకి చేరేసరికి మరి మూడు నిమిషాలు పడుతుంది. అప్పటికి నాలో చురుకుపాలు అందుకొంటుంది. ఆఖరిసారిగా రిస్టు వాచి ముళ్ళని చూసిన కళ్ళు ఇంక వేగం హెచ్చిస్తేగాని లాభం లేదని కాళ్ళకి బుద్ధి చెప్తాయి. ముందున్నది మెయిన్‌రోడ్డు జాగ్రత్త అని కళ్ళని హెచ్చరిస్తుంది మనసు.

ఒక్కొక్క బస్సుని అందుకొనేందుకు నేను పరుగు తీస్తాను. ఇంకో రోజు బస్సే నన్ను అందుకోవాలన్నట్లు పరుగుతో వస్తుంది ఆ రోజు ఇద్దరం ఓడిపోయేము నా ఓటమికి కారణాలు చెప్పనందుకే నా శ్రీమతి నా మీద విరుచుకు పడుతుంది. బస్సు ఓటమికి కారణం చెప్పవలసిన వాడు బస్సు కండక్టరు.

పది గంటల వరకు బస్సు రాలేదు. తాపీగా పరిసరాలని తిలకిస్తూ క్యూలో నిలబడ్డాను. ఎదురుగా పేవ్‌మెంట్ మీద ముష్టివాడు — 'అయ్యా...

బాబూ... అమ్మా ధర్మం చేయండి తల్లీ. ఈ కుంటివాడికి ఒక పైసా దానం చేయండి బాబూ."

వాడి అరుపులు బస్సు కదులుతుంటే రోజూ చెవుల్లో పడతాయి. కాని సావకాశంగా ఆ మానవాకృతిని చూసే వీలు ఆ రోజు నే కలిగింది. ఒక చింకి గోనె పట్టు మీద ఒక కాలు ముందుకి జాచి కూర్చున్నాడు. కుడికాలు తొడకిందు తుండెలా, కుర్రాడు తిని పారవేసిన మొక్కజొన్న కండెలా ఉంది. కుడి ప్రక్కన ఊతకర్ర, ఎడమ ప్రక్కన చిల్లులు పడిన ఎనామిల్ డొక్కు, దాని సరసనే వాలికలుగా ఉన్న చింకిలాల్చీ—ఇదీ వాడి సంసారం.

వాడిని చూస్తుంటే నా చిన్నతనంలో జరిగిన ఒక సంఘటన గుర్తుకొచ్చింది. అది వేసవికాలం. ఎండవేడికి అలసటగా వగరుస్తూ ఒక ఊరకుక్క మా ఇంటి వీధి అరుగుమీద పడుకొంది. భోజనాలయేక మా నాన్న తీరుబడిగా వాలుకుర్చీలో పడుకొని ఆ సంవత్సరం పరీక్ష పేపర్లు తిన్నగా వ్రాయనందుకు నన్ను పట్టుకొని చివాట్లు పెట్టేరు. ఆ అవమానాగ్ని దహిస్తుంటే కోపంతో ముఖమెర్రగా చేసుకొని, వస్తున్న దుఃఖాన్ని అపుకొంటూ విసురుగా వీధి అరుగు మీదకి వచ్చేను.

కుక్క నాలికనుంచి చొంగ కారుతున్నది. అది నన్ను ఒకసారి చూసి, "నాన్నచేత చివాట్లు తిన్నవాడా! నీ లక్ష్యం నాకేమిటన్నట్లు మళ్ళా కళ్ళు మూసుకొంది.

ఆఖరికి ఈ కుక్కకి కూడా నేనంటే అలుసే? చేయెత్తి "ఛీ" అన్నా కదలకుండా పడుకొంది. పౌరుషం నాలో పొడుచుకొచ్చింది. పైడు కాలువ పక్కగా రోడ్డు మరామత్తు కోసం పోసిన రాళ్ళ కుప్పలోంచి ఒక కంకరరాయి తీసుకొని బలంగా కుక్కను కొట్టేను. నా చేతిలో కంకరరాయి చూడగానే అది పరుగు తీసింది. అయినా రాయి దాని కాలికి తగిలింది. కుయ్యో... కుయ్యో... మంటూ కాలెత్తి కుంటుకూ అది పరుగుతీసింది.

"వెధవ కుక్క. పొగరణిగింది. చేయెత్తి అదలిస్తే కదలదేం? ఇదేం తన తాతగారి ఇల్లనుకొందా? నేనేం తన పంటికింద బొమ్మి కనుకుందా?' యుద్ధరంగంలో విజయం సాధించిన వీరుడిలా బోరవిరుచుకొని ఇంటిలోకి వెళ్ళిపోయేను. నన్ను నిర్లక్ష్యంగా చూసినందుకు చక్కగా కుక్కపై ప్రతీకారం తీర్చుకొన్నానన్న సంతృప్తి కలిగింది నాకు.

రెండు రోజులనాడు ఆ కుక్క మళ్ళా గుమ్మంలో కన్పించింది. మా అమ్మ గిన్నె అడుగున మిగిలిన మెతుకులు ఓ నాలుగు రోజూ దాని ముందు వేస్తుంది. అందువల్లనే ముందురోజు దెబ్బతిన్నా అది మళ్ళా మా ఇంటికి వచ్చింది. దాని కాలు పుండయ్యి, రక్తం, చీము కారు



తున్నాయి. "అయ్యో! పాపం ఏరాలుగాయి వెధవలు రాయితో కొట్టారో, కాలు విరిగిపోయింది" అంది అమ్మ జాలిగా.

ఆ రాలుగాయి వెధవని నేనేఅని అమ్మతో చెప్పే ధైర్యం నాకు లేకపోయింది. అమ్మతో పాటుగా నేనూ "అయ్యో పాపం" అన్నాను అమ్మవేసిన అన్నం మెతుకులు తిని అది గోడవారగా పడుకొని కళ్ళు మూసుకొంది బాధతో అది మూలుగుతుంటే నిజంగా నాకు కష్టం అనిపించింది. "ఏదైనా ఆసుపత్రికి తీసుకుపోయి కట్టు కట్టిస్తేనో" అన్నాను.

అమ్మ నన్ను వింతగా చూస్తూ "ఊరకుక్కకి మందూ, మాకూ ఏమిటిరా?" అంది.

ఊరకుక్కకి దెబ్బతగలగా లేందీ అది మానేందుకు మందు మాత్రం ఎందుకు అక్కరలేదు? ఆ మాట అమ్మని అడిగే ధైర్యం లేదు. ఆ దెబ్బకి కారణణ్ణి నేను అని మనసు

బాధించడంచేత అమ్మ చూడకుండా కాస్త కొబ్బరి నూనెలో దూది ముంచి దాని దెబ్బకి రాయాలని ప్రయత్నించాను. అది నన్ను చూస్తూనే గర్ మంటూ పళ్ళు బయటికిపెట్టి భయంకరంగా అరచింది. నా కాళ్ళు గడగడలాడేయి. చేతిలో దూది పారవేసి గోడకి అంటుకుపోయేను. "ఒరేయ్ హాస్నం చేయకు, కరవగలదు" అంటూ అమ్మ ఇంట్లోంచి కేక పెట్టింది.

వారంనాటికి కుక్క కాలు పుండు మానింది. కాని అక్కడి వరకు కాలు ఎండిపోయింది. మూడు కాళ్ళమీదే కుంటుతూ నడుస్తుండేది.

ఈ ముష్టివాడి కాలు కూడా నా వంటి తుంటరి వెధవల పనివల్లే అలా అయిపోయిందేమో అనిపించింది. కాని, మనిషికి కుక్కతో సామ్యం చూడడానికి నా మనసు అంగీకరించ లేదు. కుక్కని కొట్టినట్లు మనిషిని రాయితో ఎవరైనా కొడతారా? ఏదో ప్రమాదంలో కాలు పోయి ఉంటుంది అనుకొన్నాను.

వాడు కర్రె పుల్లలాంటి చేతులు ముందుకి చాచి, అమ్మా... అయ్యా.. బాబూ, అంటూ నోరు ముయ్యకుండా అరుస్తూనే ఉన్నాడు. వాడి కళ్ళు, బ్యాటరీ తక్కువగా ఉన్న కారు హెడ్ లైటులా ఉన్నాయి. వాడి కడుపు గాలి పోయిన రబ్బరు బుంగలా ఉంది ఉన్నత గిరిశిఖరాల్లా ఉన్నాయి. వాడి కణతల దగ్గర బొమికలు. వాటి కిందుగా ఉండే లోయల్లా ఉన్నాయి లోతుకు పోయిన వాడి దవడలు. పండబారిన రెల్లుగడ్డిలా ఉంది వాడి జుట్టు. ఆ గడ్డి మొలచిన రేగడిమట్టి నేలలా ఉంది వాడు పెట్టుకొన్న గోచిపాత.

అయినా ఆకలి వాడి శక్తినంతా పిండి వాడిచే అరిపిస్తున్నది అమ్మా .. బాబూ ... అయ్యా ..

నాకు ఏనాడూ పెద్దగా ధర్మం చేసే అలవాటు లేదు. చాలీ చాలని జీతం డబ్బులు నా కటువంటి పాడు అలవాటు కాకుండా ఎప్పటికప్పుడు కాపాడుతూ వచ్చాయి.

ఫస్టు తారీకున జీతం అందుకోగానే బుద్ధిగా ఇంటికొచ్చి అంతా శ్రీమతి చేతిలో పెడ్తాను. మధ్యాహ్న సమయంలో కాఫీకోసం, అప్పుడప్పుడు నేను వేసుకొనే కిళ్ళీల కోసం తగినంత డబ్బు లెక్క కట్టి, అదనంగా మరి ఒక రూపాయి కలిపి నా స్వంత ఖర్చుకోసం జేబులో పెడుతుంది ఆమె.

"ఇదేమి ప్రారబ్ధమయ్యా! హాయిగా డబ్బంతా నీ చేతిలో ఉంచుకొని ఆడది నీ ముందు చెయ్యి జాచేలా చేసుకోవాలి కాని" అనే వాగు మిత్రులు. వారికి ఇందులో ఉన్న సులువు తెలియదు. శ్రీమతి చీరలకోసం నగలకోసం రాత్రి, పగలు వేధించే బాధ తప్పుతుంది "ఈసారి జీతం రాగానే తప్పక కొనుక్కో" అనేయవచ్చు సునాయా

సంగా. జీతం రాగానే అంతా ఖర్చు చేస్తే నెలంతా గడిచేదెలా?' అది శ్రీమతి ఆలోచించవలసిన సమస్య. దానితో నాకు ప్రమేయం లేదు.

ఒక్కొక్క రోజున మరీ హృదయ విదారకంగా ముష్టివాళ్ళు అరుస్తుంటే తెలివి తక్కువగా చేయి జేబులోకి వెళ్ళేది. "హేయ్, మహాదాన కర్ణుడిలా చూరవ చూపుతున్నావ్. ఉన్నది కాస్తా ధర్మం చేస్తే, నీ కాఫీ మాటేమిటి? నీ కిల్లీల మాటేమిటి?" అని నిలదీసేది జేబు.

"ఒక రూపాయి హెచ్చుగా ఉంది కదా?" నాలో ఏమూలో మిగిలి ఉన్న మా తాతగారి రక్తం జవాబు చెప్పేది. మా తాతగారు మహాదాన పరులని ఖ్యాతి గడించేరుట. కన్న కొడుకుని అటు చదువు ఇటు ఆస్తి లేకుండా వదలిపెట్టిన ఆయన నిస్వార్థ పరత్వాన్ని నేటికీ ఆ ఊరులో చెప్పుకొంటూ ఉంటారు. మా నాన్నగారు స్వశక్తివల్ల గుమాస్తా అయేరంటే, నన్నూ, తన అడుగుజాడల్లో నడిచేలా పెంచేరంటే అది వేరే సంగతి. మా తాతగారి రక్తం నాలో ఇంకా మిగిలి ఉన్నదని ఆ రోజునే నేను తెలుసుకున్నాను.

ఈ రోజు ఆ ముష్టివాడి కాలు చూస్తుంటే చిన్నవాడు నేను రాయితో కొట్టిన కుక్క మాటికి జ్ఞాపకం రాసాగింది. 'పాపం... పాపం' అని పదిసార్లకి పైగా మనసు జాలి జపం చేసింది. పది దగ్గరవుతున్నాది. ఇంకా నా బస్సు — అంటే నేను ఎక్కవలసిన పదవ నెంబరు బస్సు రాలేదు. అది తప్ప మిగిలిన నెంబర్ల బస్సులన్నీ వస్తున్నాయి; పోతున్నాయి. నా ముందువాళ్ళు, వెనుక వాళ్ళు జాలిగా నావంక చూసి వెళ్ళిపోతున్నారు. నేను మాత్రం ఉన్నచోటనే స్థాణువులా నిలబడి ఉన్నాను. ఎదురుగా ముష్టివాడు "అమ్మా... అయ్యా, బాబూ!" నోరు ముయ్యకుండా అరుస్తూనే ఉన్నాడు. వేసిన వాళ్ళు ఒకటో, రెండో పైసలు వాడి ముందు పరిచివున్న గుడ్డలో వేసి

---

ఇరుగు పొరుగున వుండే స్కూలుపిల్లలిద్దరు స్కూలు వదిలిపెట్టాక రిక్షా ఎక్కి ఇళ్ళకు వెళుతున్నారు. అందులో ఒక పిల్ల తీయని కంఠంతో కూనిరాగం తీస్తోంది. రెండో పిల్ల "ఏమేయ్, నువ్వింత బాగా పాడతావు గదా? రేడియోలో పాడగూడదూ?" అంది.

"అమ్మో రేడియోలోనే?" అంది మొదటి పిల్ల.

"పోనీ పెద్ద రేడియోలో వద్దులే. చిన్న చిన్న ట్రాన్సిస్టర్లుంటాయే, వాటిలో పాడు" అంది రెండో అమ్మాయి.

పోతున్నారు. లేనివారు చీదరింపుగా చూసి వెళ్ళిపోతున్నారు.

రెండు నిమిషాల క్రిందట వచ్చి నా వెనుక నిలచిన మార్వాడీ రోడ్డు దాటివెళ్ళి ముష్టివాడి గుడ్డమీద ఐదో, పదో పైసలనాణెం విసరి వచ్చాడు. "ఆ మార్వాడీ మనసు వాడి అరుపులతో రెండు నిమిషాలకే కరగిపోయిందే, అరగంటగా వింటున్నా నీలో చలనంలేదు ఎందువల్ల ?" అంటూ నామనసుని ప్రశ్నించేను.

"అదేంమాట, వాడిని చూస్తూ నేను మాత్రం కరగలేదని నీకెవరు చెప్పేరు ? పాపం ... పాపం అని పదిసార్లు అనుకోలేదూ ? అది వాడిమీద జాలివల్లనే కదా !" మనసు జవాబు చెప్పింది

కాని అందువల్ల ముష్టివాడు పొందిన లబ్ధి ఏముంది ? మార్వాడీ నీలా పాపం అంటూ జపం చేయకుండా నే డబ్బులు విసిరి చక్కా వచ్చేడు. ముష్టివాడికి కావలసింది డబ్బు. నీ జాలి జపం వల్ల వాడి గుడ్డలో ఒక్కపైసా ఐనా రాలిందా ?

అడిగే వాడికి చెప్పేవాడు ఎప్పుడూ లోకువే. అందుకే మనసు క్షణకాలం ఊరుకొంది. నాతో వాదనకి దిగకుండా మంచిగా మందలించడం మొదలు పెట్టింది. "నీదగ్గర ఏమంత డబ్బుందని ? కాస్త వెనకా ముందూ చూసుకో నక్కర్లేదూ ? వాడి గుడ్డలో నువ్వు వేయకపోతే ఇంకొకడు వేస్తాడు. అడుక్కొనే వాళ్ళకి ఉన్న అవకాశమే అది. రేపు నీకు డబ్బు కావాలంటే ఎవరిస్తారు? కాస్త ఆలోచించి చూడు."

దూరంగా పదవ నంబరు బస్సు అలస్యమైనందుకు ముఖం ఎర్రగా కందపెట్టుకొని పరుగుతో వస్తున్నది. గాలి నా చెయ్యి చూసి ఇంకొక రెండు నిమిషాల్లో నీకు వాహన యోగం ఉందని దినఫలం చెప్పింది.

ఆ రోజువరకు నేనెంతో మంచివాడిని. మనసు చెప్పిన మాట ఎప్పుడూ కాదనలేదు కాని ఆరోజు ఎందువల్లో మనసుకి ఎదురు తిరిగితే ఎలాఉంటుందో చూడాలనిపించింది నాకు. గబగబ రోడ్డు దాటి, ఆ వైపు కూర్చున్న ముష్టివాడి గుడ్డలో పది పైసల నాణెం పడవేసేను.

అరగంటనుంచి ఎదురుగా నిలచి ఉన్న నన్ను, ఆ ముష్టివాడు చూడలేను అనుకొనేందుకు ఆస్కారం లేదు. నేను దగ్గరికి రావడం చూసి పరిచయస్తుడిలా ముఖం పెట్టేడు. పిప్పిపళ్ళు కొద్దిగా బయటపెట్టి చిన్నగా నవ్వినట్లు కూడా అనిపించింది నాకు. చివరకు నే నే గెలిచేను అన్నట్లు ఉంది వాడి నవ్వు.


వాడి నవ్వుతో నాకు కొంచెం కోపం తోసుకొచ్చిన మాట వాస్తవమే. ఇది నీగెలుపు కాదు. మనసుపై నేను సాధించిన విజయం అనుకొన్నాను మెల్లగా. అంతలో వాడు

కట్టె పుల్లలాంటి చేతులెత్తి "దండాలు బాబయ్యా" అన్నాడు. వాడి నమస్కారంతో నా కోపం పోయింది. ఆరోజు ఏదో కొత్తపని చేసే నన్న తృప్తి మిగిలిపోయింది. పరుగుతో వచ్చి పదవనంబరు బస్సు అందుకొన్నాను.

మరునాటినుంచి బస్సు వేళకి కాస్త ముందుగావచ్చి ముష్టివాడి గుడ్డపై పది పైసల నాణెం విసరడం అలవాటుగా మారింది. రోజూ తనకన్న ముందుగా వస్తున్న నన్ను చూసి బస్సుముఖం చిటపటలాడించేది. తనని ఓడించడానికే నేను అలా చేస్తున్నాననుకొని ఉంటుంది. నా రాకలో పరమార్థం, ముష్టివాడి కోసం నేను చేస్తున్న త్యాగం దానికేం తెలుసు? తలవంచుకొని దిగులుగా ఖాళీ నోటితో కొట్టుదాటి పోతూంటే తెల్లబోయి చూసిన కిల్లీకొట్టువాడికి తెలుసు. కాని,

ఇలా ఈ దానకాండ ఒక సంవత్సరం పొడుగునా రోజూ, ఆదివారాలు, సెలవురోజులు, మినహాయిస్తే జరిగిపోయింది. ఇక్కడ పరిస్థితి అర్థమయ్యేందుకు కథనాన్ని కాస్త పక్కకి తిప్పక తప్పదు.

ఒక నెలజీతం సంవత్సరాంతంలో బోనస్‌గా ఇచ్చే ఆచారం మా కంపెనీలో ఉంది. రానున్న ఆ సొమ్ముని తలుచుకొంటూ అది ఎలా ఖర్చు చేయాలా అనే ఆలోచనలతో మేమంతా — అంటే నా వంటి చాలీచాలని జీతాలు అందుకొం



టున్న గుమాస్తాలమంతా ఏడాది పొడుగునా తలలు బద్దలు కొట్టుకొంటూ ఉండేవాళ్ళం. కాని తీరా అది చేతికి అందేసరికి, ఆ వాసన మరి వాళ్ళకి ఎలా తెలిసేదో అప్పుల వాళ్ళు గ్రద్దల్లా ఆఫీసు గుమ్మంలోనే కాచివుండి సగానికిపైగా భక్షించి మరీ వదలిపెట్టేవారు. ఆ సంవత్సరం అంతా కలిసి ఒక పథకం వేశాము. ఆ సొమ్మంతా నెల తిరిగే వరకు ఆఫీసులోనే దాచి ఉంచాము. ఇంక అక్కడ తిండి ఆశ లేదని ఆ గ్రద్దలన్నీ నిరాశతో ఎగిరిపోయేక సంతోషంగా మా జేబులు నింపుకొన్నాము.

అందువల్లనే ఆ రోజు ఎంత ఉత్సాహంగా ఉంది. ఆ ఉత్సాహంలో ముష్టివాడికి కూడా పాలు పంచిపెట్టాలనుకొన్నాను. వాడికి కూడా ఒక నెల ముష్టి, ఉజ్జాయింపుగా రెండున్నర రూపాయలు బోనస్‌గా ఇయ్యాలనుకొన్నాను. "మరీ అంత అవసరం లేదు. అందులో సగం. సగం అంటే అక్షరాల సగం కాదు, ఒక్క రూపాయి దానంచెయ్యి చాలు" అంది మనసు.

ముందే చెప్పాను కదూ మనసుకి ఎదురు తిరగడం నేర్చుకొన్నానని, దానితో ఏదో విధమైన ఆనందాన్ని పొందుతున్నానని "చేసి చేసి చచ్చుగా ఒక రూపాయి దానం ఏమిటి? నువ్వు ఫలానావారి మనుమడవని మరచిపోకు–" తాతగారి రక్తం సమయానికి సరిగా హెచ్చరించింది. మనసుపై ధైర్యంగా ఎదురు తిరిగే శక్తి నాలో పొదులుకొంది. తాతగారి త్యాగ రక్తం నాలో జలజల ప్రవహించింది "ఒక రూపాయి కాదు. ఐదు రూపాయలు దానం చేస్తాను. నా సొమ్ము– నా యిష్టం" అన్నాను మనసు నోరు నొక్కివేస్తూ.

"నీకు పిచ్చి పట్టుకొంది. ఈ దానంతో నువ్వు స్వర్గానికి మెట్లు కట్టాలనుకొంటున్నావు —" అంది మనసు వ్యంగ్యంగా నవ్వుతూ. "శబాష్ మనుమడా" అంది తాతగారి రక్తం.

సాయంకాలం ఆ ముష్టివాడు అక్కడ కూర్చోడు. రెండో పూట వాడి ఆఫీసు ఇంకో వీధికి మార్చుకుంటాడు. ఆ వీధి నాకు తెలుసు. ఒకటి, రెండు సార్లు స్నేహితుల ఇళ్ళకిపోతూ వాడిని అక్కడ చూశాను. కాని అక్కడికిపోయి వాడికి దానం చేయాలనే సంకల్పం నాకు లేదు. అసలు అక్కడి ముష్టివాడితో నాకు పరిచయమే లేదు. పదవ నంబరు బస్సు స్టాపుకి ఎదురుగా కూర్చునే ముష్టివాడికే నేను దానంచెయ్యాలి. వాడే నా ముష్టివాడు. వాడే నాలో దాగివున్న దానగుణం కదిలేలా ప్రేరేపించినవాడు. నేను చిన్ననాడు రాయితో కొట్టిన ఊరకుక్కలాంటివాడు మనసుకి ఎదురు తిరిగి పనులు చేయడంలో ఉన్న మజా చూపించినవాడు. వాడు

మరునాడు ఉదయంకాని అక్కడ ఉండడు.

ఇంటికి చేరేక సొమ్ము అంతా అర్ధాంగి చేతిలో పెట్టడం ఆచారం. ఐదో, పదో దాచి ఇంతే యిచ్చారంటూ అబద్ధం చెప్పే అలవాటు నాకులేదు. నేను ఏడాది క్రిందటి వరకు ఎంతో మంచి వాడిని. ఈ నిమిషం వరకు ఎంతో నిజాయితీ పరుడిని. కాని ఆ రోజున ఆ ముష్టి వెధవకోసమే మనసుని ఎదిరించి మంచి వాడిని అన్న బిరుదును కోల్పోయాను. ఈ రోజు వాడికోసం ఇంకో త్యాగం చేస్తున్నాను. వాడికి ఇదేం పట్టదు. అమ్మా! అయ్యా! అనే తన అరుపులకే గుడ్డలో డబ్బులు రాలుతున్నాయను కొంటాడు. నేనెన్ని కష్ట, నిష్ఠురాలు భరిస్తూ వాడికి దానంచేసున్నానో ఆ కుంటి వెధవకి ఏం తెలుసు?

ఐదు రూపాయల కాగితం కిల్లీ కొట్టువాడి చేతిలో పెడుతూ "నీ దగ్గర ఉంచు, రేపు తీసుకొంటాను" అన్నాను.

మరునాడు ఉదయం మరికొంచెం ముందుగానే ఇంటినుంచి బయలుదేరేను. మరి వెయ్యబోయేది లాకాయి లూకాయి ముష్టా? ఐదు రూపాయల ముష్టాయెను. ఆ అనుభూతిని పూర్తిగా అనుభవిస్తూ, ఎవరైనా చూస్తున్నారా లేదా అని ఇటు అటు పరీక్షిస్తూ, నెమ్మదిగా, హుందాగా, అంత త్యాగానికి సరిపడిన ప్రతిఫలం అందుకొంటూ చేయాలాయెను

రోజూ కన్న ముందుగా పోతున్న నన్ను, రోడ్డు పలకరించింది. రోజూకన్న జోరుగా పోతున్న నన్ను కాలం మందలించింది. నేను అసలు విషయం వాటితో చెప్పలేదు. చెప్పినా అవి అర్థం చేసుకోలేవు. 'నీలాంటి గుమాస్తాకి ఐదు రూపాయల ముష్టేమిటి? నోట్లు అచ్చువేసే మిషనుకాని తయారుచేసేవా?' అంటూ ప్రశ్నిస్తాయి. అందుకే తల వంచుకొని మౌనంగా నడచిపోయాను.

కాని ఆశ్చర్యం; ఆరోజు ముష్టివాడు అక్కడ లేడు. బజారు రోడ్డు ఎంత రద్దీగా వున్నా—వాడి అరుపులు లేని కారణంగా నిశ్శబ్దంగా ఉంది. నిర్భాగ్యుడు ఐదు రూపాయలు దానం చేద్దామనుకొంటే ఈరోజే

---

బట్టలషాపులో గుమాస్తాతో ఒకావిడ: "ఈ చీరలన్నీ అసహ్యంగా వున్నాయి. ఇంతకంటె మంచివిలేవా?"

గుమాస్తా: "ఉన్నాయిగానండి, ఇప్పుడు అసహ్యంగా వుండడమే ఫ్యాషనండి."

---

# సొగసైన కురులు



# రీటా

ఏపుగా, అందంగా జుట్టును పెంచుతుంది

ఒకరి శిరోజ సౌందర్యంచూచి మరొకరు ఇక ఎంతమాత్రం అసూయపడవలసిన అవసరం లేదు. రీటా వాడి మీ కురుల సౌభాగ్యాన్ని వృద్ధి చేసుకోండి.

వీటో కంపెనీ, మద్రాసు ।




R.20 TG


రాకుండా మానుకొన్నాడేం – అనుకొన్నాను. నాకెందుకో భయం వేసింది. నిష్కారణంగా ఐదు రూపాయల దానఫలం తప్పిపోతుందేమో అన్న కంగారు పుట్టింది. వాడు ఇంకో చోటుకి వెళ్ళిపోయి ఉంటే? రాత్రికి రాత్రే చచ్చిపోయి ఉంటే?

"వెధవ, వాడికి ప్రాప్తంలేదు. హాయిగా ఏదైనా ఖర్చుపెట్టుకో–" మనసు సలహా సరఫరా చేసింది. "నీ బోడిసలహా ఎవరూ కోరలేదు!" అని మనసుని చీదరించుకొంటూ ఇటు అటు మరికాస్త పరిశీలనగా చూసేను. ఏ కారణం వల్లనైనా చోటు కాస్త మార్చేడేమో... ఆలోచనలో పడి నేను కాస్త పక్కగా నిల్చేనేమో?

కనుచూపు ఆనినంత వరకు వాడి రూపం ఎక్కడా కన్పించలేదు. చెవులకి వాడి అరుపులు వినిపించలేదు. "ఇక్కడ కూర్చునే ముష్టివాడు ఈ రోజు రాలేదేమా?" స్వగతంలా పైకి విన్పించేటట్టు అనుకొన్నాను "ముష్టి వెధవలకి ఒక చోటేమిటి? ఎక్కడ నాలుగు డబ్బులు రాలుతుంటే అక్కడికి తయారవుతారు" అన్నాడు నా పక్కన నిలబడ్డవాడు. "కాని, ఏడాదిబట్టీ చూస్తున్నాను. రోజూ వేళ తప్పకుండా..." "బజారు వీధికదా, అందువల్ల కాస్త ఎక్కువ కాలమే గిట్టుబాటుగా ఉండివుంటుంది" నా మాటని మధ్యలోనే అందుకొన్నాడు ఇంకొకడు.

పదవ నంబరు బస్సు పందిలా బురద చిమ్ముకొంటూవచ్చి స్టాపులో నిలబడింది. ఆఖరిసారిగా ఆ ముష్టి వాడికోసం ఇటు అటు చూశాను. ముష్టివాడు రాలేదు. నా జేబులో ఐదు రూపాయల నోటు బరువుగా దిగలాగింది. మనసు దారిపొడుగునా దగుల్బాజీ సలహాలు అందిస్తునేవుంది.

ఆఫీసునుంచి తిరిగివస్తూ ఆ నోటు కిళ్లీకొట్టు వాడి చేతిలో పెట్టేను. "నేను అడిగేవరకు నీ దగ్గర వుండనీ" అన్నాను. కంటపడితే ఇంటావిడ కైంకర్యం చేస్తుందని నా అన్నట్లు నవ్వేడు వాడు 'ఒకరికి అప్పు తీర్చాలి' వాడు అడక్కపోయినా సంజాయిషీ ఇచ్చుకొన్నాను

మరునాడు కూడా ముష్టివాడు రాకపోతే నేను ఇంత ఔదార్యంగా చేయాలనుకొంటున్న ఐదు రూపాయల దానఫలం ఏంకాను? నన్నింతగా ఆరాటపెడుతున్న ఆ ముష్టివాడిని ఏం చెయ్యాలి? ఆలోచనలతో ఆ రాత్రి సరిగా నిద్ర పట్టలేదు.

* * *

ఆ తరువాత చాలా రోజులకి వాడు మళ్ళా కన్పించేడు. బజారు వీధిలో కాదు, ఆస్పత్రిలో. నేను దెబ్బలతో బాధపడుతూ మంచం మీద మూలుగుతున్న సమయంలో. ఆ అన్నట్టు ఈ దెబ్బలు, ఆస్పత్రి వగైరా విషయాలు చెప్పలేదుకదూ? అసలు ఏం జరిగిందో పూర్తిగా నాకూ తెలియదు.

నేను ఆ మరునాడు మామూలుగా వాచీముల్లు చూసుకొంటూ రోడ్డుమీద నడచిపోతున్నాను. మా వీధిలో ఉన్న ఒకే ఒక మేడలో ఆ రోజునే అద్దెకు దిగిన ఒక పెద్ద ఆఫీసరుగారి సామానులతో నలభై మైళ్ళ వేగంతో వస్తున్న లారీ ఆప్యాయంగా నన్ను ముద్దు పెట్టుకుంది. అది కాస్త మోటు సరసం కావడంతో నేను పదిరోజుల పాటు ఒంటిమీద తెలివి లేకుండా ఆస్పత్రిలో పడివున్నాను.

నాకు తెలివి వచ్చేక మా శ్రీమతి కళ్ళు తుడుచుకొంటూ, ముక్కు చీదుకొంటూ ఇదంతా చెప్పింది. "నా మంగళసూత్రం బలం వల్ల కాని లేకపోతే మీకు బ్రతికే దెబ్బలు తగిలాయా" అంటూ పదేపదే పైట లోంచి పుస్తెలు తీసి కళ్ళ కద్దుకో సాగింది.

నిజంగా నాకు చచ్చే దెబ్బలే తగిలాయి. పాదం లేని ఎడమకాలు చూసుకొన్నాక చచ్చిపోయినా బాగుండేది అనిపించింది. మిత్రులు, బంధువులు ఎంతగా ధైర్యం చెప్తున్నా తీసివేసిన పాదం తిరిగి అతకబడదు కదా? కృత్రిమంగా ఒక పాదం తగుల్చుకొని, అది కనిపించకుండా యాతన పడుతూ బతుకు సాగదియ్యాలి అనే ఆలోచన నాకేమంత సుఖమయింది కాదు.

ఆ వార్డులో ముక్కా చెక్కా పోకుండా పాకంగా ఉన్న మనిషి ఒక్కడు కూడా లేడు. అందులో ఎవరితో నన్ను సరిపోల్చుకొని సంతోషించే వీలుంటుందా అని ఇటు అటు చూస్తున్నాను అప్పుడే కన్పించాడు ఆ ముష్టివాడు. ఊతకర్ర ఆసరాతో మెల్లగా మంచాల మధ్యనుంచి నడుస్తున్నాడు ఎదురుగా కన్పించిన నర్సుని ఏదో అడిగేడు. ఆవిడ చీడపురుగని ఆకుమీద చూసినట్లు విదిలిస్తూ విసురుగా ఏదో జవాబు చెప్పింది.

వాడు మెల్లగా నా మంచం సమీపంలోకి వచ్చేడు. నా మంచం పక్కగా వున్న వరండా వైపు ఉన్నాయి వాడి చూపులు. నేను అదివరలో చూసినప్పటికన్న దీనంగా వున్నాడు. పొడుచుకు వస్తున్న ఆ ఎముకల మీద చర్మం ఉందా, లేదా అన్నట్టు అనిపిస్తున్నది ప్రాణం పోసుకు నడచివస్తున్న అస్థిపంజరంలా ఉన్నాడు.

వాడిలాంటి వాళ్ళు ఈ బీద దేశంలో చాలా మంది ఉండవచ్చు. కాని వీడు పదవనంబరు బస్సు స్టాపుకి ఎదురుగా కూర్చునే ముష్టివాడు. అదివరలో వాడికి దానం చేద్దామనుకున్న ఐదు రూపాయల నోటు అప్పుడు దగ్గర ఉంటే వాడి ముఖాన విసిరికొట్టి "వెధవా పోయి కడుపునిండా ఇంతతిని మరీ కన్పించు" అంటూ తరిమివేసేవాడిని. కాని ప్రస్తుతం నాదగ్గర ఒక్క పైసాకూడా లేదు. ఇటు అటు మంచాలమీద ఉన్నవారు నావంటి వారే. అప్పు అడిగినా ప్రయోజనం ఉండదు.

నేను వాడి దీనస్థితి గురించి ఆలోచిస్తుండగానే వాడు నా మంచానికి ఇంకా దగ్గరికి వచ్చేడు. వాడు నన్ను చూసి పోల్చుకొనే అవకాశం లేదు. తలకంతా కట్టు ఉంది. చాలా రక్తం పోవడంచేత ముఖమంతా పాలిపోయి, కళ్ళు పైకి పొడుచుకు వచ్చినట్లు ఉన్నాయి ఆ రోజు ఉదయాన్నే శ్రీమతితో పోట్లాడి అద్దంలో ముఖం చూసుకొన్నాను. 'నేను చిన్న పిల్లవాడిని కాదుగదా; ఎలా ఉన్నా జడుసుకోనులే' అన్నాను. కాని నిజానికి నా ముఖంచూస్తే నాకే జాలి కలిగింది. గొంతుకలో గురగుర మంటూ ఏడుపు ముంచుకొచ్చింది. ఇంకా భయం కూడా తొంగిచూసింది ఎందుకు బ్రతికి పోయానా అని బాధపడ్డాను.

అయినా వాడు నన్ను పోల్చుకొన్నట్లే నవ్వేడు. ఆ మొదటి రోజు నేను పదిపైసలు దానం చేసినప్పుడు నన్ను చూసి నవ్వినట్లే ఉంది ఆ నవ్వు. ఏ పరిస్థితుల్లో ఉన్నా కుక్క తన యజమానిని పోల్చుకోగలదట. ముష్టివాళ్ళకి కూడా అటువంటి శక్తి ఉందేమో మరి. "నా అవిటితనంచూసి అంతగా జాలి పడేవాడివి. ఇప్పుడు నీ పని ఏమయింది అబ్బాయి" అని పరిహాసం

చేస్తున్నట్లు ఉన్నాయి వాడి చూపులు.

నా చిన్నతనంలో కాలు విరిగిన ఊర కుక్కకి మందు పెట్టబోతే గర్‌మని మొరిగినట్లు ఉంది వాడి మాట. "బాబూ. ఆరో నంబరు వార్డుకి దారి ఇదేనా?" వాడు ఆ ప్రశ్న నన్ను అడుగలేదు. వరండాలో పోతున్న ఏ జమాదారునో అడిగేడు.

"పాపం... పాపం ఎంత దీనం — మాట్లాడుతున్నాడో! ఎండు కర్రలా ఎలా ఉన్నాడో—" మనసు జాలి జపం మొదలు పెట్టింది. నా గొంతికి కారం రాసుకొన్నట్టు మండింది. "ఈ స్థితిలో ఉన్న నా మీద నీకు జాలి లేదుకాని, ఆ కృతఘ్నుడి మీద మాపిస్తున్నావు" అంటూ కోపగించుకొన్నాను."

కృతఘ్నుడా? ఏమీ ఎరగనట్లు మనసు ప్రశ్నించింది.

"కాదూ? ఏడాదిపాటు కిల్లీ మానుకొని వాడికి ధర్మం చేసేనే. ఎప్పుడూ లేనిది శ్రీమతిదగ్గర అబద్ధం ఆడి వాడి కోసం ఐదు రూపాయలు దాచేనే... నా మంచితనాన్ని వాడు గ్రహించేడా? చూసి కూడా అయ్యో బాబూ! అన్నాడా? పైగా నవ్వుతాడుట ... నవ్వు ... ...

కోపంతో నా మెదడులోని నరాలు పటపట లాడేయి బాధగా అమ్మా అని తల పట్టుకొన్నాను. ఆసరికి వాడు నా మంచానికి ఇంకా చేరువగా వచ్చేడు. పోల్చుకొన్నట్లే చూసేడు. క్షణకాలం ఆలోచనగా ఇటు అటు చూసేడు. ఒక్క నిమిషంపాటు నా కళ్ళవంక చూసేడు. ఎంతో జాలిగా, ఓదార్పుగా ఉన్నాయి ఆ చూపులు. "అయ్యో బాబూ. మీరా? ఏమిటి ఇలా అయిపోయేరు. మీ వంటి ధర్మప్రభువులకి ఇట్లాంటి ఆపద..." అలవాటుపడిన వాడి గొంతుక

---

ఒక ఇల్లాలు పొరుగింటావిడతో :-

"ఈ మగవాళ్ళని నమ్మడానికి వీల్లేదమ్మా!"

పొరుగింటావిడ:- ఏం అలా అంటున్నారు?"

ఇల్లాలు :- "రాత్రి నాకో కల వచ్చింది. మా ఆయన ఎవరో అందమైన పిల్ల వెంటపడి పోతున్నాడు."

పొరుగింటావిడ :- "అదంతా కలే కదండీ?"

ఇల్లాలు :- "అదికాదమ్మా! నా కలల్లోనే అంత బరితెగించినవారు ఇహ ఆయన కలల్లో ఇంకెంత అఘాయిత్యం చేస్తున్నారోనని..."

---

లోంచి రాబోయే మాటల కోసం నా చెవులు రిక్కించుకొని వింటున్నా.

వాడు పెదవి కదపకుండా నా మంచం దాటిపోతున్నాడు. నాలో సహనం సన్నగిలింది. నాలోని మంచితనం మంట కలిసింది. ఊపుగా పక్కకి ఒత్తిగిల్లేను శక్తినంతా కూడదీసుకొని వాడి చేతికింది ఊత కర్ర లాగేశాను.

ధభేలుమని వాడు పడిపోయేడు. "అమ్మో" అని బాధతో కేకపెట్టేడు. నా చేత రాతి దెబ్బతిన్న కుక్క అరుపులా ఉంది వాడి కేక. నాకు తృప్తి కలిగింది. వాడి కృతఘ్నతకి చక్కని బహుమానం ఇచ్చేనంటూ మురిసిపోయేను.

కాని అంతలోనే ఏదో భయం. పాపం చేసేనన్న భయం పట్టుబడిపోతానన్న భయం. ఎవరైనా చూసేరేమో అన్న భయం ఏమైనా ప్రశ్నిస్తారేమో అన్న భయం.

తలమీదుగా దుప్పటి ముసుగు పెట్టి నిద్ర నటించేను. వాడు అరచిన కేక, పడిన చప్పుడు విని చుట్టుపక్కల మనుష్యులు గుమిగూడేరు. "ఎలా పడిపోయాడు?" ఎవరో ప్రశ్నిస్తున్నారు "అదిగో ఆ మంచం మీద ఆయన తోసేసేడు. వాడి చేతికింద కర్ర లాగేసేడు—"ఎవరో చెప్తున్నట్లు వినిపించింది. "కర్ర నేల మీద జారి పట్టుతప్పి ఉంటుంది" ఎవరో జవాబు చెప్పేరు.

నా బుర్ర రంగుల రాట్నంలా తిరిగిపోతున్నాది. బాధతో నా వంటి మీద తెలివి తప్పిపోతున్నాను. "సాయంకాలం నేను వెళ్ళేసరికి సరిగానే ఉన్నారు డాక్టర్. ఇంతలోనే ఇంతగా ఏమయ్యింది?" శ్రీమతి ప్రశ్న ఏడుపు కంఠంతో బాధగా వినిపించింది.

"ఏమయిందో వెంటనే చెప్పడం కష్టం. కుట్లన్నీ కదలిపోయినట్లు ఉన్నాయి. ఎక్స్‌రే తీసి చూడాలి" డాక్టరు జవాబు నాకు మత్తులో మెల్లగా వినిపించింది నాకు.

* * *

ఆరునెలల తర్వాత వీధిలో తిరిగి కాలు పెట్టేను. ఇదివరలో అవసరం లేకపోయినా అడుగులతో రోడ్డు కొలుస్తూ నడిచేవాడిని. ఇప్పుడు అశక్తత కొద్దీ ఇంకా మెల్లిగా నడుస్తున్నాను. "బాబూ! కులాసా?" ఐదు రూపాయల నోటు నా చేతిలో పెడుతూ కిళ్ళీకొట్టువాడు ప్రశ్నించేడు.

దానిని చూడగానే ఆ నోటుకి హక్కుదారుడు అయిన ముష్టివాడు జ్ఞాపకం వచ్చేడు. ఆనాటి సంఘటన గుర్తుకొచ్చింది. పశ్చాత్తాపం గుండెల్లో పోటులా పొడిచింది. పాపం నన్ను పోల్చుకోలేడేమో? నలుగురిలోనూ పలకరిస్తే [illegible]రించుకొంటానని అనుకున్నాడేమో? అన్యాయంగా వాడిని తోసివేసేను. ఏం దెబ్బలు తగిలేయో? ఎలా ఉన్నాడో? వాడికి మందు మాకులు

చేసేందుకు ఇంట్లో ఎవరైనా ఉన్నారో లేరో – అడుక్కొనే శక్తి లేక ఆకలి బాధ పడలేక ఎంతగా ఏడుస్తున్నాడో? ఈ సొమ్ము వాడిది. మానసికంగా వాడికి దానం చేసింది. ఇది వాడికి అందచేస్తే ఎందుకైనా పనికివస్తుంది.

పది నిమిషాలు గడచేసరికి బస్సు స్టాపు చేరుకొన్నాను. ఎదురుగా పేవ్‌మెంట్ మీద గోనెపట్టా పరచి ఉంది. ఆశగా అటు చూపు తిప్పేను. అక్కడ ఆ కుంటివాడు లేడు. ఆ స్థలాన్ని ఒక ముష్టిది ఆక్రమించుకొంది. వెన్నుకి అంటుకుపోయి ఉన్న కడుపుతో, అర్ధనగ్నంగా ఉన్న ఒడలితో, ఎండిపోయిన రొమ్మును పిల్లనోటికి కుక్కి దీనంగా "అమ్మా... బాబూ... అయ్యా" అని అరుస్తున్నాది. తల్లి రొమ్ములోంచి ఎంత పీకినా పాలు రాక ఆ పిల్ల గోల గోలగా ఏడుస్తున్నాది.

ఆ ఐదు రూపాయలనోటు దాని ముఖంమీద కొట్టి "పో... పోయి నీ బిడ్డకిన్ని పాలు కొనుక్కో ... నీ కడుపుకింత తిండికొనుక్కో" అనాలని పించింది. కాని ఆ సొమ్ము నాది కాదు. దానిని వేరొకరికి దానం చేసేందుకు నాకు ధైర్యం లేదు.

ఆఫీసుకి వెళ్ళబుద్ధికాక వెనక్కి తిరిగి వచ్చేశాను "ఏం వంట్లో బాగా లేదా?" శ్రీమతి ప్రశ్నించింది. "సరిగానే ఉంది కాస్త బడలికగా ఉంది" జవాబుచెప్పి మంచంమీద వాలిపోయేను.

కాని ఆ బడలిక అంత సులువుగా తీరేదికాదు. రోజూ కలత నిద్రలో కాలు విరిగిన కుక్క అరుపులూ దభీలుమని నేల పడ్డ ముష్టివాడి కేకలు నన్ను వెంటాడుతూనే వున్నాయి ఆ కుక్క కాలుకి మందు పెట్టగలిగితే, ముష్టివాడికి ఈ ఐదు రూపాయలు అందివ్వగలిగితే నా మనస్సుకి శాంతి కలిగేదేమో? ఆ సంఘటనలను సులువుగా మరవగలిగేవాడినేమో?

ఒక్కోసారి అనిపిస్తుంది నాకు, ఇది భగవంతుడు విధించిన శిక్ష అని.

***